TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత


www.telanganacapitalnews.com

TELANGANA CAPITAL NEWS

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 111 | శుక్రవారం, ఆగస్టు 23, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

### చేసేవి అప్పులు... చెప్పేది గొప్పలు...

## మోడీపై రేవంత్




హైదరాబాద్: ఏ ప్రదాని చేయనన్ని అప్పులు చేసి దేశాన్ని దివాళ తీయించిన మోదీ గొప్పలు చెప్పుకుంటున్నారని మండి పడ్డారు టిపిసిసి చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మోడీ ప్రధాని అయ్యే నాటికి దేశం అప్పు రూ. 55 లక్షల కోట్లని.. నేడు అదే అప్పును రూ. 1.55 లక్షల కోట్లకు చేర్చి దేశాన్ని అప్పులపాలు చేశారని ధ్వజమెత్తారు. దేశాన్ని మోదీ, అమిత్‌షా, అదానీ, అంబానీ చెరబట్టారని మండి పడ్డారు. దేశ సంపద అంతా వారి గుప్పిట్లో చిక్కుకుపోయిందంటూ ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థల్ని తమ గుప్పిట్లో పెట్టుకుని కొందరికే లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా విధానాలకు నిరసనగా దేశంలోని అన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయాల ఎదుట కాంగ్రెస్ పార్టీ గురువారం ఆందోళనలు నిర్వహించింది. దీనిలో భాగంగా హైదరాబాద్ లోని ఈడీ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో రేవంత్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ సంపదను కార్పొరేట్లు ఎలా దోచుకుంటున్నారో హిండెన్‌బర్గ్ సంస్థ సహసోపేతంగా బయట పెట్టిందని పేర్కొన్నారు. అదే అంశంపై ఇప్పటికే పార్లమెంట్‌లో కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిందని గుర్తు చేశారు. అదానీ, అంబానీతో సహా మోడీ తన పరివారాన్ని కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా జేపీసీ వేయాలంటూ పార్లమెంట్‌లో డిమాండ్ చేస్తే మోడీ తప్పించుకు తిరిగారని.. ప్లాన్ ప్రకారం నాలుగు రోజులు ముందుగానే పార్లమెంట్‌ను వాయిదా వేశారని మండిపడ్డారు.

### సిఎం రేవంత్ రెడ్డికి...

## హైకోర్టు నోటీసులు



హైదరాబాద్: నేడు తెలంగాణ హైకోర్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. లోక్ సభ ఎన్నికల సందర్భంగా కొత్తగూడెం సభలో భారతీయ జనతా పార్టీపై రేవంత్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలకు ఈ నోటీసులు ఇచ్చారు. దేశవ్యాప్తంగా ఉన్న రిజర్వేషన్లను ఎత్తేసేందుకు బిజెపి కుట్ర పన్నుతోందని, రాజ్యాంగాన్ని మార్చబోతున్నారని నాడన్నారు. అంతేకాక 1925 నాటికల్లా దేశాన్ని హిందూ దేశంగా మార్చేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రతినబూనిందన్నారు. ఆ కుట్రలో భాగంగానే దేశాన్ని హిందూ దేశంగా మార్చబోతున్నారని అన్నారు. బిజెపి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ వ్యాఖ్యలపై బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు.

### ఎంఎల్‌సి కవితకు...

## అస్వస్థత




హైదరాబాద్: ఢిల్లీ మద్యం స్కామ్‌లో భాగంగా తిహార్ జైల్లో ఉన్న బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత మరోసారి అస్వస్థతకు గురికావడంతో ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కవిత వైరల్ ఫీవర్‌తో పాటు గైనిక్ సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. గత జులైలో ఆమెకు జ్వరం, గొంతునొప్పి రావడంతో జైలు నుంచి దీనదయార్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పడంతో మళ్లీ జైలుకు తరలించారు. ఆమె మరోసారి అస్వస్థతకు గురికావడంతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు గురువారం ఢిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. ఢిల్లీ మద్యం స్కామ్‌లో విచారణను అగస్టు 28కి వాయిదా వేసిన విషయం తెలిసిందే. గతంలో కవితను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో వర్చువల్‌గా విచారించిన విషయం తెలిసిందే.

### యుద్ధభూమిలో లేని ఏ సమస్యకైనా సమాధానం"..

## ఉక్రెయిన్ వివాదంపై ప్రధాని మోదీ

వార్సా: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యొక్క "యుద్ధం యొక్క యుగం కాదు" సందేశం ఈ రోజు తన పోలాండ్ కౌంటర్ డోనాల్డ్ టస్క్‌తో కలిసి చేసిన సంయుక్త ప్రకటనలో ప్రతిధ్వనించింది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మరియు పశ్చిమాసియాలో ఇరాన్ మరియు ఇజ్రాయెల్ మధ్య సైనిక ఉద్రిక్తతను "ప్రతిఒక్కరికీ చాలా ఆందోళన కలిగించే విషయం"గా అభివర్ణిస్తూ, దేశాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి సంభాషణ మరియు దౌత్యం యొక్క ఆవశ్యకతను ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. ఉక్రెయిన్‌కు తన మైలురాయి పర్యటనకు కొన్ని గంటల ముందు సందేశం వచ్చింది అతను రేపు కీవ్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీని కలవనున్నారు. "ఉక్రెయిన్ మరియు పశ్చిమాసియాలో విభేదాలు ఆందోళన కలిగిస్తున్నాయి, అయితే ఏ సమస్యకైనా సమాధానం యుద్ధభూమిలో కాదు.. మేము సంభాషణ మరియు దౌత్యానికి మద్దతు ఇస్తున్నాము" అని ఆయన సంయుక్త ప్రకటనలో తెలిపారు. పోలాండ్ పర్యటన సందర్భంగా వివాద పరిష్కారానికి చర్చల ఆవశ్యకతను ప్రధాని మోదీ ప్రస్తావించడం ఇది రెండోసారి. SCO సమావేశం సందర్భంగా 2022లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరిగిన సమావేశంలో మొదట ప్రస్తావించిన "యుద్ధం కాదు" సందేశం ు పోలాండ్‌లోని భారతీయ సమాజాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో కూడా పొందుపరచబడింది. "భారతదేశం ఈ ప్రాంతంలో శాశ్వత శాంతికి న్యాయవాది. మా స్టాండ్ చాలా స్పష్టంగా ఉంది - ఇది యుద్ధ యుగం కాదు.




### అదానీ అక్రమాలకు...

## వ్యతిరేకంగా నిరసన



హైదరాబాద్: అదానీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త అదానీపై హిండెన్ బర్గ్ ఆరోపణల నేపథ్యంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిరసనలకు పిలుపునిచ్చింది. హైదరాబాద్‌లోని గన్‌పార్కు నుంచి ఇడి ఆఫీస్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడారు.

చిన్నాచితక లీడర్లపై ఇడి దాడులు చేస్తోందని, రూ. లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన అదానీని ఇడి ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. అదానీ అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నామని సీతక్క స్పష్టం చేశారు. జెసిపి వేస్తేనే అక్రమాలు బయటకు వస్తాయన్నారు. బిజినెస్ రూల్స్ ప్రకారం వ్యాపారాలు చేస్తామని ఎవరు వచ్చిన తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ వేస్తుందని తెలియజేశారు. ఈ ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొంటారని పేర్కొన్నారు.

### వక్ఫ్ బిల్లుపై కొనసాగుతున్న పార్లమెంట్ ప్యానెల్...

## తొలి సమావేశం



న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లుపై పార్లమెంటు సంయుక్త కమిటీ గురువారం మొదటిసారి సమావేశమైంది, మైనారిటీ వ్యవహారాలు , న్యాయ మంత్రిత్వ శాఖల అధికారులు ముసాయిదా చట్టంలో ప్రతిపాదించిన వివిధ సవరణల గురించి వారికి వివరిస్తున్నారు. ప్రస్తుతం సమావేశం కొనసాగుతున్నది. బిజెపి సభ్యుడు జగదాంబికా పాల్ నేతృత్వంలోని 31 మంది సభ్యుల కమిటీ, వివాదాస్పద బిల్లును పరిశీలించడానికి లోక్‌సభ బాధ్యతలు చేపట్టింది, దీనికి ప్రతిపక్ష పార్టీలు, ముస్లిం సంస్థల నుండి నిరసనలు వెల్లువెత్తాయి. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు కమిటీకి "బిల్లుపై ప్రతిపాదించిన సవరణల" గురించి వివరిస్తారని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. "మేము మొత్తం 44 సవరణలను చర్చించి, వచ్చే సెషన్ నాటికి మంచి, సమగ్రమైన బిల్లును తీసుకువస్తాము" అని జగదాంబికా పాల్ తెలిపారు.

### రుణమాఫీ లేదు కానీ రైతులతో...

## రణం చేస్తున్నారు



### : హరీష్ రావు

యాదాద్రి భువనగిరి ప్రతినిధి: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని, వెంటనే రైతుల రుణ మాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బిఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాదగిరిగుట్ట లోని హరిత టూరిజం హెూటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అక్రమ కేసులతో వేధిస్తున్నారని మండిపడ్డారు. రైతుల రుణం మాఫీ చేయకుండా రైతులతో రణం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి రైతుకు రుణ మాఫీ జరిగేంతవరకు రైతులకు అండగా ఉంటామన్నారు. పోలీసులు కూడా చట్టానికి లోబడి పనిచేయాలన్నారు. ఆరు గ్యారంటీ పథకాలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో రైతు రుణ మాఫీ పేరుతో పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగి మోసం చేశారని మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి పాపం చేసి ముఖ్యమంత్రి పదవి సొంతం చేసుకున్నారని, రేవంత్ పాపం చేస్తే.. దేవుడు ప్రజలను శిక్షించవద్దని, శ్రీ లక్ష్మి నరసింహ స్వామీని వేడుకున్నామని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి దైవ ద్రోహానికి పాల్పడ్డారని, సీఎం ఒకలా, మంత్రులు మరోలా రుణమాఫీపై ప్రకటనలు చేయడం వాళ్ళ చిత్తశుద్ధికి నిదర్శనమని చురకలంటించారు. రైతు రుణ మాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, దేవుళ్ల దగ్గర ప్రాయశ్చిత్తం చేసుకోవాలన్నారు. అన్ని రకాల వడ్లకు బొనస్, రైతు భరోసా వచ్చేంత వరకు.. రైతు రుణమాఫీ పూర్తి అయ్యే వరకు మా పోరాటం ఆగదన్నారు. 2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులకు బేషరతుగా 2 లక్షలు చెల్లించాలన్నారు. రైతు రుణమాఫీ పూర్తిగా చేసే వరకు సిఎం ప్రమాణం చేసిన అన్ని ఆలయాలకు, చర్చలకు వెళ్తామని హెచ్చరించారు. రైతులందరికీ రుణమాఫీ జరిగేవరకు మా పోరాటం ఆగదని రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని పిలుపునిచ్చారు.

## ప్రతి రైతుకు రుణమాఫీ అమలు చేయాలి..

హైదరాబాద్: బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా గురువారం మండల కేంద్రమైన ముదిగొండలో రైతుల పక్షాన తక్షణమే ఎటువంటి షరతులు లేకుండా రైతుల రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు కొద్దిసేపు రాస్తా రోకోను నిర్వహించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎటువంటి షరతులు లేకుండా రైతుల రుణమాఫీ తక్షణమే అమలు చేయాలని, రేషన్ కార్డు, పాస్ బుక్ లేకపోయినా రుణమాఫీ చేయాలని వారు నినాదాలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, నాయకులు పోట్ల వెంకటప్రసాద్, గడ్డం వెంకట్, తదితర నాయకులు మాట్లాడుతూ%ౌ% కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసి అధికారంలోకి వచ్చిందని వారు ఆరోపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పింది 40,000 కోట్ల రుణమాఫీ చేస్తామని, కానీ అమలు చేయడంలో విఫలం చెందారన్నారు. కేబినెట్ సమావేశంలో 31వేల కోట్ల అమలు చేస్తామని, కేవలం బడ్జెట్ లో పెట్టింది 26వేల కోట్లు మాత్రమేనని, మొన్నటి లెక్కల ప్రకారం 17,900 కోట్లకు గానూ, కేవలం 7500 కోట్లు మాత్రమే అమలు చేశారని, ఇంకా లక్షల్లో రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని వారు ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ ఆర్థిక శాఖ మంత్రి రుణమాఫీ అందరికీ వర్తింపజేస్తే తన పదవిని తృణప్రాయంగా వదులుకుంటానని సవాలు విసిరినా సవాల్ ను స్వీకరిస్తూనే.. ఇప్పుడు రుణమాఫీ అమలు చేయకపోవడంతో రాజీనామా ఎవరు చేయాలో చెప్పాలన్నారు.

## బీఆర్ఎస్ నేతల రాస్తారోకో



### కాంగ్రెస్ లీడర్ల స్ప్లిట్ పర్సనాలిటీ...

## ఆ వ్యాధిగాని సోకిందా?




హైదరాబాద్: అదానీ వ్యవహారంలో కాంగ్రెస్ వైఖరి చూస్తుంటే ద్వంద్వ నీతి కూడా ఆత్మహత్య చేసుకుంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఓ వైపు ఢిల్లీ కాంగ్రెస్ ఏమో అదానీ సంస్థలు మోదీ జేబు సంస్థలంటూ ఆరోపణలు చేస్తుంటే.. మరోవైపు తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి మాత్రం అదానీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఇవ్వాళ అదే రేవంత్ రెడ్డి సహా మంత్రులు అదానీ సంస్థకు వ్యతిరేకంగా ఆందోళన చేయనున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు ఏమైనా స్ప్లిట్ పర్సనాలిటీ వ్యాధితో బాధపడుతున్నారా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

**అక్కడో తీరు.. ఇక్కడో తీరా?..**

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని రెడ్ కార్పెట్ వేసి మరీ అదానీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. నేడు నిరసన తెలపనుండటం ఈ ఏడాదిలోనే అతి పెద్ద జోక్ అని కేటీఆర్ అన్నారు. అదానీ సంస్థలకు ప్రోత్సహకాలు ఇచ్చి ఇప్పుడు అదే అదానీ మోసగాడని ఆరోపిస్తున్నారంటే కాంగ్రెస్‌ను ఏమనాలని ప్రశ్నించారు. ఇలాంటి డ్రామాలతో దేశాన్ని మోసం చేయగలమని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారా? అని ప్రశ్నించారు. గల్లీలో దోస్తీ.. ఢిల్లీలో కుస్తీ. ఇదీ కాంగ్రెస్ నీతి. దీనిపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పగలరా అంటూ నిలదీశారు.

**హిండెన్ బర్గ్ ఆరోపణలు..**

సెబీ చైర్‌పర్సన్ మాధబి పురి బచ్–అదానీ సంస్థలు కుమ్మక్కైనట్లు హిండెన్ బర్గ్ అనే అమెరికా సంస్థ ఆరోపణలు చేసింది. దీని ఆధారంగా ఈ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)తో విచారణ చేయాలని కాంగ్రెస్ గురువారం దేశ వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చింది. దీనిపై ట్విట్టర్ వేదికగా కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు.

## అందరికీ రుణమాఫీ అమలు చెయ్యాలి: పువ్వాడ అజయ్



రఘునాధపాలెం: రైతుల కోసం తమ ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధమని, ఈ దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడతామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. రఘునాధపాలెం మండలం మంచుకొండ ప్రధాన రహదారి వద్ద పార్టీ పిలుపు మేరకు రైతులతో నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ.. రుణమాఫీ ఆంక్షలు లేకుండా అందరికీ అమలు చెయ్యాలని, లేని పక్షంలో ప్రజలే కాంగ్రెస్ మెడలు వంచుతారన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ చిత్తశుద్ధి లేని రుణమాఫీ అని, ఎంత మందికి రుణమాఫీ ఇవ్వాలో శాస్త్రీయంగా లెక్కలు లేకుండా చేశారన్నారు. రైతులు రుణాలు తీసుకుంటే రుణాలపై ఉన్న వడ్డీ చెల్లిస్తేనే రుణమాఫీ అవుతుందని ఇప్పుడు అంటున్నారని మండిపడ్డారు. అనేక సాంకేతిక కారణాలు అని చెప్పుకుంటూ కాలం వెల్లబుచ్చుతున్నారన్నారు. నాడు కేసీఆర్ చేసినప్పుడు లేని సాంకేతిక సమస్యలు ఇప్పుడు ఎలా వస్తున్నాయని ధ్వజమెత్తారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని, అడ్డగోలు ఆంక్షలు, అర్థం లేని షరతులతో రైతులను మోసం చేస్తున్నారని పువ్వాడ అజయ్ మండిపడ్డారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు వీరునాయక్, నాయకులు ఆర్జేసి కృష్ణ, బీరెడ్డి నాగచంద్ర రెడ్డి, మద్దినేని వెంకట రమణ, కూరకుల నాగభూషణం, గుత్తా రవి, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, నాగేండ్ల కోటి, మోతరపు శ్రావణి, పగడాల శ్రీ విద్య, కూరాకుల వలరాజు, ధోన్ వాన్ సరస్వతి, దండా జ్యోతి రెడ్డి, కన్నం ప్రసన్న, దానాల శ్రీకాంత్, తోట వీరభద్రం, దేవభక్తిని కిషోర్ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు తాజ్ మాజీ కార్పొరేటర్లు మచ్చ నరేందర్, నర్సింహారావు, దడాల రఘు, మండల పార్టీ నాయకులు మాజీ ఆత్మ చైర్మన్ లక్ష్మణ్, పిన్ని కోటేశ్వరరావు, చిన్నబోయిన సైదులు, హరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### సిఐఎస్ఎఫ్ అధీనంలో...

## కెజి కర్ ఆస్పత్రి



కోల్‌కతా: ఆర్‌జి కర్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో సిఐఎస్ఎఫ్ మోహరింపునకు సుప్రీం కోర్టు ఆదేశించిన మరునాడు కేంద్ర పారా మిలిటరీ దళ బృందం ఒకటి బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వైద్య కళాశాల, ఆసుపత్రిని సందర్శించి, భద్రత ఏర్పాట్లను తనిఖీ చేసింది. ఒక సీనియర్ అధికారి నేతృత్వం లో కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సిఐఎస్ఎఫ్) బృందం బుధవారం ఉదయం ఆసుపత్రికి చేరుకున్నది. భద్రత ఏర్పాట్ల గురించి వారు స్థానిక పోలీసులతోను, ఆసుపత్రి అధికారులతోను మాట్లాడినట్లు అధికారి ఒకరు తెలిపారు. హత్యాచారానికి గురైనట్లుగా భావిస్తున్న ఒక పోస్ట్‌గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ మృతదేహం ఈ నెల 9న కర్ వైద్య కళాశాల, ఆసుపత్రి సెమినార్ రూమ్‌లో కనిపించడం దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలకు దారి తీసింది. ఈ కేసు సందర్భంగా ఒక సివిక్ వాలంటీర్‌ను ఆ మరునాడు అరెస్టు చేశారు. ఒక గుంపు 15న తెల్లవారు జామున కర్ వైద్య కళాశాల, ఆసుపత్రిలోకి ప్రవేశించి మర్జన్సీ విభాగం, నర్సింగ్ కేంద్రం, మందుల స్టోర్‌లలో విధ్వంసకాండకు పాల్పడడమే కాకుండా సిసిటివి కెమెరాలను నాశనం చేశారు. 'సదరు కిరాతక కృత్యం, ఆ దరిమిలా ప్రదర్శనల నేపథ్యంలో శాంతి భద్రతల ఉల్లంఘనను నివారించేందుకు రాష్ట్ర భద్రత బలగాలను రాష్ట్ర ప్రభుత్వం మోహరించవలసి ఉంది. ఆసుపత్రి ఆవరణలో జరిగిన నేరంపై దర్యాప్తు సాగుతున్నందున ప్రభుత్వం ఆ పని చేయవలసిన అగత్యం మరింతగా ఉంది. ఆసుపత్రి ఆవరణలో విధ్వంసకాండ కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు సంసిద్ధంగా లేదో మాకు అర్థం కావడం లేదు' అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. కోర్టు ఆతరువాత ఆసుపత్రిలో భద్రత బాధ్యతను సిఐఎస్ఎఫ్‌కు అప్పగించింది.

**ముగ్గురు పోలీస్ అధికారుల సస్పెన్షన్**

ఇది ఇలా ఉండగా, ఆర్‌జి కర్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో క్రితం వారం విధ్వంసకాండ సందర్భంగా తమ అధికారులు ముగ్గురిని కోల్‌కతా పోలీస్ శాఖ సస్పెండ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. సస్పెండైన పోలీస్ సిబ్బందిలో ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్లు కూడా ఉన్నారని వారు తెలిపారు. జన సమూహంఈ నెల 15 తెల్లవారు జామున ఆసుపత్రి ఆవరణలోకి ప్రవేశించి, ఎమర్జన్సీ విభాగం, నర్సింగ్ కేంద్రం, మందుల స్టోర్‌లను ధ్వంసం చేసిన విషయం విదితమే. ఆ సంఘటనపై దర్యాప్తు సాగుతోంది.

**మాజీ ప్రిన్సిపాల్‌కు పాలీగ్రాఫ్ పరీక్ష?**

కోల్‌కతాలోని ఆర్‌జి కర్ వైద్య కళాశాల, ఆసుపత్రి మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌కు సిబిఐ నిజ నిర్ధారణ పరీక్ష నిర్వహించవచ్చు. హత్యాచారానికి గురైన ట్రైనీ మహిళా డాక్టర్ మృతదేహం ఆసుపత్రి సెమినార్ హాల్‌లో కనిపించిన రెండు రోజుల తరువాత రాజీనామా చేసిన సందీప్ ఘోష్ ఇప్పటికే పలు మార్లు దర్యాప్తు నిమిత్తం సిబిఐ అధికారుల ముందు హాజరయ్యారు. 'మా ప్రశ్నలకు హెూష్ ఇచ్చిన సమాధానాలు కొన్నిటిలో వ్యత్యాసాలు ఉన్నందున ఆయన సమాధానాలను మరింతగా నిర్ధారించుకోవాలని అనుకుంటు న్నాం. అందువల్ల ఆయనకు నిజ నిర్ధారణ పరీక్ష నిర్వహణ గురించి ఆలోచిస్తున్నాం' అని అధికారి ఒకరు 'పిటిఐ'తో చెప్పారు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీపై హత్యాచారంపై దర్యాప్తులో భాగంగా ఘోష్‌ను మంగళవారం కూడా దర్యాప్తు అధికారులు ప్రశ్నించారు. సిబిఐ అధికారులు గత కొన్ని రోజుల్లో ఘోష్‌కు రకరకాల ప్రశ్నలు వేశారు. డాక్టర్ మృతి వార్త వచ్చి న తరువాత ఆయన ఎలా వ్యవహరించారు, ఆ తరువాత ఎవరిని సంప్రదించారు, ఆమె మృతదేహాన్ని చూసేందుకు సుమారు మూడు గంటలకు పైగా ఆమె తల్లిదండ్రులను ఎందుకు నిరీక్షింపచేశారు అని కూడా సిబిఐ అధికారులు ప్రశ్నించారు.

### ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లుపై సలహాలివ్వండి..

## కలెక్టర్ కోయ శ్రీహర్ష




పెద్దపల్లి: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలను ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్, డీసీపీ ఎం.చేతనతో కలిసి రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, విద్యావేత్తలు, న్యాయ వాదులు నిపుణులతో నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. నూతన ఆర్ఓఆర్ చట్టం– 2024 ముసాయిదా బిల్లులో పేర్కొన్న అంశాలు, ఈ బిల్లు తీసుకురావడంలో గల ఉద్దేశం అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ.... భూ సమస్యల పరిష్కారం కోసం నూతన ఆర్ఓఆర్ చట్టం రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించిందని, దేశంలో వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమమైన భూ రికార్డుల నిర్వహణను పరిశీలించిన నిపుణుల బృందం నూతన ఆర్ఓఆర్ 2024 ముసాయిదా బిల్లును రూపొందించిందన్నారు. నూతన చట్టం రూపకల్పనలో విస్తృతంగా ప్రజలను భాగస్వామ్యం చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్చ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. భూ రికార్డుల నిర్వహణకు మెరుగ్గా ఉండేలా ముసాయిదా బిల్లుపై రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు (రి–టైర్డ్, సర్వీస్) తమ సూచనలను అందజేయాలని కలెక్టర్ కోరారు. నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలు ఏమైనా ఉంటే రాతపూర్వకంగా 2, 3 రోజుల్లో కలెక్టరేట్ కార్యాలయానికి అందిస్తే, వాటిని ఒక నివేదిక రూపంలో సిద్ధం చేసి తుది చట్ట రూపకల్పన కోసం సీసీఎల్ఏకు అందజేస్తామన్నారు. చర్చలో పాల్గొన్న రి–టైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు సుదర్శన్, శంకరయ్య, న్యాయవాదులు శశి భూషణ్ సాయిల్ రెడ్డి, టీఎన్జీవో అధ్యక్షులు బొంకూరి శంకర్ తమ సూచనలు, సలహాలు తెలిపారు. గ్రామంలోని ఆబాది భూముల రికార్డులు అప్డేట్ చేయాలని, సాధా బైనమా భూముల రిజిస్ట్రేషన్ రుసుం వసూలు చేయాలని, పోజిషన్ కాలం ఉండాలని, అప్పిలేట్ అథారిటీ ఆర్డీఓ స్థాయిలో ఉండాలన్నారు. పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్ నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై పలు సూచనలు చేశారు. 1971లో ఆర్ఓఆర్ చట్టం తెస్తే 1989లో రూల్స్ అందించారని, 2020 ఆర్ఓఆర్ చట్టానికి ఇప్పటివరకు రూల్స్ తయారు చేయలేదని, నూతన ఆర్ఓఆర్ చట్టం 2024 అమలు చేసిన నెలరోజుల లోపల రూల్స్ రూపొందించాలని తెలిపారు. నూతన ఆర్ఓఆర్ చట్టం అమలు కోసం ప్రతి గ్రామంలో రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు తీసుకోవాలని, భూ సమస్యల అప్పిలేట్ అథారిటీ– జిల్లా స్థాయిలోనే ఉండేలా చూడాలని తెలిపారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, వి.హనుమా నాయక్, తహసీల్దార్ లు, నిపుణులు, న్యాయవాదులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### తుంగతుర్తిలో రణరంగం...

## గాదరి కిషోర్ పై కాంగ్రెస్ కార్యకర్తల దాడి

సూర్యాపేట: తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. రుణమాఫీ చేయాలని ధర్నా చేస్తున్న గాదరి కిషోర్‌పై కాంగ్రెస్ నేతలు దాడికి పాల్పడ్డారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి పట్టణంలో రుణమాఫీ చేయాలని చేపట్టిన రైతు నిరసన దీక్షపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. రాళ్లతో, కోడి గుడ్లతో దాడి చేయడంతో బిఆర్ఎస్ నేతల కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టారు.



ఈ దాడిని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఖండించారు. మహిళ జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులపై దాడి చేస్తున్నారని, ఇదేనా ప్రజా పాలన అని కెటిఆర్ ప్రశ్నించారు.

## సంపాదకీయం

శుక్రవారం, ఆగస్టు 23, 2024

# వృద్ధులను జాతి సంపదగా గుర్తించాలి

బాల్య, కౌమార్య, యవ్వన, వృద్ధాప్యాలు జీవితంలో ఏ ప్రాణికయినా తప్పనిసరిగా సంభవించే జీవన రేఖలు. 'ఎండుటాకును చూసి పచ్చటాకు నవ్వింది' అని తెలుగులో ఒక సామెత ఉంది. పండిపోయి చెట్టు నుంచి రాలే ఎండుటాకును చూసి చెట్టు రెమ్మలకు వేలాడే పచ్చటాకు నవ్విందట. అది గమనించిన ఎండుటాకు పిచ్చిమొహమా రేపు నీకు కూడా నా గతే కదే.. అని పకపకమంటూ ఆ ఎండుటాకు రాలిపోయిందట. మనిషి జీవిత చక్రంలో వచ్చే మార్పులు బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం. అయితే మనిషిగా పుట్టిన ప్రతివ్యక్తీ తుదిశ్వాస ఉన్నంతవరకు, ప్రతి దశలోనూ ఎంతో ఆనందంగా జీవించాలని కోరుకుంటాడు. వృద్ధాప్యము లేదా ముసలితనము మానవ జన్మలో చివరి దశ. దీనిని నిర్వచించడానికి వయోపరిమితి లేనప్పటికి, మనిషి శరీరము రోగనిరోధక శక్తిని క్రమక్రమముగా కోల్పోయి చివరకు మరణించే స్థితికి చేరే దశను వృద్ధాప్యముగా చెప్పవచ్చు. నేడు పిల్లలుగా, యువజనులుగా, నడివయస్కులుగా పాత్రలు పోషిస్తున్న అందరూ వృద్ధుల బృందంలోకి అడుగు పెట్టే పరిస్థితి తప్పక వస్తుంది. యవ్వన దశలో వారు సమాజానికి అవసరమైన సమస్త ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొని రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు తమ వంతు కృషి చేసి ఉంటారు. పనులు మాని, లక్ష్యాలు పూర్తి చేసుకుని ఉత్పత్తికి దూరమై విశ్రాంతి తీసుకుంటూ జీవన చరమదశను ముగిద్దామని దీర్ఘ సెలవులో ఉన్న జాతి నిర్మాతలే వృద్ధులు. అందుకే వారికీ ఓ రోజును కేటాయించి సమాజానికి వారు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా ఏటా ఆగష్టు 21న అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ డే జరుపు కుంటున్నారు. ఐక్య రాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో ప్రతి 10 మందిలో ఒకరు ఇప్పుడు 60 ఏళ్ల వయసును కలిగి ఉన్నారు. 2050 నాటికి ప్రపంచంలోని ప్రతి అయిదుమందిలో ఒకరు 60 ఏళ్లు ఆ పైబడి వయసు కలిగి ఉంటారట. 2150వ సంవత్సరానికి ప్రపంచంలో ప్రతి ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు ముదుసలిగా ఉంటారట. సీనియర్ సిటిజన్లుగా పేరు పడిన ఈ వయోవృద్ధుల అవసరాలు తీర్చే కృషిలో వ్యక్తులూ, సమాజమూ పునరంకితం అయేందుకు గాను ప్రపంచం వ్యాప్తంగా అన్ని దేశాలూ అంతర్జాతీయ వృద్ధాప్య దినాన్ని జరుపు తున్నాయి. తన కుమారులకు, కుమార్తెలకు, మనుమళ్ళకు, ముని మనుమలకు సలహాలు ఇచ్చే వయస్సు కూడా ఇదే. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కూడా వృద్ధుల సంక్షేమానికి కొన్ని జాతీయ ప్రణాళికను, కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా గత 2007లో వృద్ధుల కోసం పోషణ, సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. అయితే, ఈ చట్టాలు అమలుకు పూర్తిగా అమలుకు నోచుకోవడం లేదన్నది తెలిసిన సత్యమే. వృద్ధుల సమస్యల పరిష్కారానికి సమాజంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలి. వేధింపులు, ఆరోగ్య సమస్యల నుంచి వృద్ధులను దూరంగా ఉంచేలా కుటుంబ సభ్యులంతా చొరవ చూపాలి. జీవితంలో వృద్ధాప్యం అనేది చివరి దశ కావడంతో– వారిలో శారీరక మార్పులను ఆపడం ఎవరితరం కాదు. వృద్ధాప్యం అన్నది శరీరానికే కానీ మనసుకు కాదని ప్రతివారూ తెలుసు కోవాలి. ప్రస్తుతం అరవయ్యేళ్ల వయసు దాటిన వారు దేశంలో 15 కోట్ల మేరకు ఉంటారని అంచనా. వీరిలో సుమారు కోటిన్నర మందికి పైగా ఒంటరి జీవితం సాగిస్తున్నారు. ఆధునిక వైద్య సదుపాయాలు, ఔషధాలు అందుబాటు లోకి రావడంతో ఆయుర్ధాయం పెరుగుతోంది. దీంతో వృద్ధుల సంఖ్య అదే స్థాయిలో అధిక మవుతోంది. ప్రపంచంలో ఎక్కువ మంది వృద్ధులు ఉన్న దేశంగా చైనా మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ 60 ఏళ్లకు పైబడినవారు 16.7 కోట్ల మంది, 80 ఏళ్లకు పైబడిన వారు పది లక్షల మంది ఉన్నారు. 80 ఏళ్లకు పైబడిన వారి 'సూపర్ సీనియర్ సిటిజన్స్' అంటారు. జపాన్‌లో నూటికి 30 శాతం మంది 60 ఏళ్లు పైబడిన వారు ఉన్నారు. 2050 నాటికి 64 దేశాలు 30 శాతం వృద్ధులతో నిండి పోతాయట! అంటే వృద్ధుల జనాభా 120 కోట్లకు చేరుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 80 శాతం వృద్ధులుంటారని ఐక్యరాజ్యసమితి చెబుతోంది. 2050 నాటికి మన దేశంలో వృద్ధుల జనాభా 30 కోట్లపైనే ఉండే అవకాశముంది. మన దేశంలో ప్రతి ఐదుగురు వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురి అవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధుల సంరక్షణ వారి పిల్లల కనీస బాధ్యత. వయసుడిగిన దశలో తమ వారసుల నుంచి వారు కోరుకునేది ప్రేమ పూర్వక పలకరింపు, ఆదరణ, అభిమానాలే తప్ప– ఆడంబరాలు, విలాసాలు కాదు. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలే కాదు, ఆర్థిక, సామాజిక సమస్యలు వారిని చుట్టు ముడుతాయి. ఇలాంటి సమయంలో వారికి అండగా నిలవాల్సి ఉండాలి. 60 ఏళ్లు పైబడిన అనుభవజ్ఞుల శక్తిని, అనుభవ సారాన్ని ఉపయోగం చేసుకుంటే తప్పకుండా ఏ దేశమైనా పురోగమిస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారే కాదు, సంపన్న కుటుంబాల లోనూ వృద్ధులైన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పించి తమ పని పూర్తయిందను కుంటున్నారు.

## ఇదిగో ఆధారాలు...

# రైతులకు ఏం సమాధానం చెప్తారు....?

### - మీకు రైతుల ఆందోళనలు కనపడతలేవా.....?

### - ఇదేనా రుణమాఫీ మీద మీ చిత్తశుద్ధి

- ఎన్నికల్లో దొంగ హామీలు ఇచ్చి రైతులను మోసగిస్తారా
- సంబురాలు చేసుకుంటున్న ఇక్కడి కాంగ్రెస్ నేతలకు ఆందోళనలు కనబడడం లేదా....?
- రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు.





**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** రైతులకు రుణమాఫీ చేశామని చెబుతున్నారు కదా ఇదిగో ఆధారాలు ఇప్పుడు రైతులకు ఏం సమాధానం చెబుతారు అంటూ రామడుగు మండల సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు సీఎం రేవంత్ రెడ్డికి సూటి ప్రశ్న వేశారు. రుణమాఫీ మీద కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని సగం మందికి కూడా రుణమాఫీ చేయలేదని రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు.గురువారం రామడుగు మండల కేంద్రంలో రోడ్డు పై రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు.ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న రైతులను, బిఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకొని అక్కడి నుండి అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దొంగ హామీలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం గద్దెనెక్కిందని మండిపడ్డారు.రుణమాఫీ అమలు కానీ రైతులకు వెంటనే కటాఫ్ తేదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనియెడల అట్టి రైతులతో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రాథమిక సహకార సంఘాలతో పాటు అనేక బ్యాంకులలో సగం మందికి కూడా రుణమాఫీ కాలేదని రుణమాఫీ అమలు చేశామని చెప్పుకోవడం ఒక భోగసని వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మిగతా రైతులకు కూడా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.రుణమాఫీ మొత్తం చేశామని సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నేతలకు రైతుల ఆందోళనలు కనబడటం లేదా అంటూ ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం దిగివచ్చి రైతులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని లేనియెడల రైతుల పక్షాన బిఆర్ ఎస్ పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ మార్కెట్ చైర్మన్ మామిడి తిరుపతి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, కలిగేటి లక్ష్మణ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ చాడ ప్రభాకర్ రెడ్డి,జిల్లా రైతుబంధు సభ్యులు వీర్ల సంజీవరావు, మాజీ సర్పంచులు పంజాల జగన్ మోహన్ గౌడ్, వీర్ల రవీందర్రావు, చాడ చంద్రశేఖర్ రెడ్డి, దాసరి రాజేందర్ రెడ్డి,ఒంటెల వెంకటరమణరెడ్డి, చంద్రారెడ్డి, జవ్వాది శేఖర్,గుండి ప్రవీణ్, సైంర్ల కరుణాకర్ ,ఏడవెల్ల మల్లేశం, మాజీ మార్కెట్ చైర్మన్ పూడూరు మల్లేశం,మాజీ ఎంపీటీసీ వంచ మహేందర్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు మామిడి నరసయ్య, అంటే ఎందుకు మార్కెట్ డైరెక్టర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు..

## తెలుగు రాష్ట్రాల స్థాయి ప్రశంసలు అందుకున్న రహీమ్ ఖాన్ పేట తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు




**తెలంగాణా క్యాపిటల్ న్యూస్ రహీమ్ ఖాన్ పేట:** తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ,వందేమాతరం ఫౌండేషన్ ప్లాన్ జెరీ ఫౌండేషన్ సౌజన్యం తో 78 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన తెలుగు రాష్ట్రాలు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ స్థాయి ఆన్లైన్ దేశభక్తి పాటల పోటీల లో రహీమ్ ఖాన్ పేట తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు కమల్ల లహరి బృందం,మల్లమారి ఆరాధ్యా బృందం పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ మధుకర్, వైస్ ప్రిన్సిపాల్ పి వెంకన్న తెలియ తెలుపగ. ఈ సందర్భంగా లహరి,ఆరాధ్య గ్రూప్‌ను, గైడ్ టీచర్ నిషాని మహేందర్ ని అభినందించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు వేణు, షర్మిల, మురళి క్రిష్ణ,వెంకన్న, సురేష్, సాంబయ్య, విజయ్, కిరణ్, బాబు, మహేందర్, రేణుక, శివరాణి, జలజ, రజిత, నర్సయ్య, శ్రీనివాస్, జ్యోతి లు పాల్గొన్నారు.

# 40 వేల డ్రగ్స్ ఎడిక్ట్స్



**హైదరాబాద్ :** తెలంగాణలో డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా మార్చుతాం అన్న సీఎం రేవంత్ రెడ్డి మాటతో మార్పు మొదలైంది. ఉక్కుపాదం మార్క్ కన్పిస్తోంది. డ్రగ్స్, గంజాయి బ్యాచ్‌ల బెండు తీస్తున్నారు. తెలంగాణను డ్రగ్ ఫ్రీ రాష్టంగా చేయాలన్న సర్కార్ సంకల్పానికి అనుగుణంగా లా అండ్ ఆర్డర్ పోలీసు,, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్.. టీజీ న్యాబ్ ఆధ్వర్యంలో త్రిశూల్ ఆపరేషన్ కేటుగాళ్ల వెన్నులో వణుకు రేపుతోంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లు సహా జిల్లాల్లోనూ డ్రగ్ నెట్ వర్క్‌కు కళ్లెం పడుతోంది. టీవీ9తో ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూలో సంచలనాల అంశాలను ప్రస్తావించారు టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య. నివేదికల ప్రకారం తెలంగాణ కొకైన్ వాడకంలో మూడో స్థానంలో.. గంజాయి వాడకంలో ఐదో స్థానంలో ఉందన్నారు. 40 వేల మంది కొకైన్‌కు ఎడిక్టయిన వాళ్లన్నారన్నారు. డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా కావాలంటే ముందుగా స్కూళ్లు, ఇంజినీరింగ్,మెడికల్ కాలేజీలు, వర్సిటీ క్యాంపస్‌లను డ్రగ్ ఫ్రీ చేయాల్సిన అవసరం వుందన్నారు. అలాగే పల్లెబాటలో కూడా డ్రగ్స్ కట్టడిపై సామాజిక బాధ్యతగా ప్రతీ ఒక్కరూ దృష్టి సారించాల్సిన అవసరం వుందన్నారు. తెలిసో తెలియకో డ్రగ్ మాఫియా ట్రాప్‌లో పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంతో భవిష్యత్ వున్న పిల్లలు డ్రగ్స్‌కు బానిసవరం చూస్తే బాధేస్తుందన్నారు.అలాంటి వారిలో పరివర్తను తీసుకురావడం ముఖ్యమన్నారు. ఆదిశగా చర్యలు చేపడుతున్నామన్నారు సందీప్ శాండిల్య.డ్రగ్స్,గంజాయి మాఫియాపై ఉక్కుపాదం మోపుతున్నారు. తనిఖీల్లో భారీగా సరుకుపట్టుపడుతోంది. అరెస్టులతో పాటు కేసుల సంఖ్య పెరుగుతూ ఉంది. రెండేళ్లలో తెలంగాణను డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా తయారవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం టీవీ9 చేస్తోన్న కృషిని ఆయన అభినందించారు. తెర వెనుకనైనా సరే పబ్‌ల్లో నైనా సరే..పల్లెబాటలో నైనా సరే ఎక్కడ డ్రగ్స్ వాడిన మక్కెలిరగొట్టి జైలుపాలు చేయడం ఖాయం. . డ్రగ్స్ కొన్నా అమ్మినా బట్వాడా చేసిన వాడినా ఇట్టే గుర్తించేలా ప్రపంచంలోనే అత్యున్నతమైన టెక్నాలజీ తెలంగాణలో అందుబాటులో ఉందిప్పుడు.హైదరాబాద్ మహానగరాన్ని గంజాయి విముక్త నగరంగా మార్చేందుకు అటు ఎక్సైజ్ ఎన్‌పోర్స్‌మెంట్ అధికారులు ఇటు తెలంగాణ నార్కోటిక్ పోలీసులు సంయుక్తంగా నడుం బిగించారు. వాళ్లు చేపట్టిన ఆపరేషన్ ధూల్‌పేట్ సత్ఫలితాలు ఇస్తోంది. గంజాయికి అడ్డాగా మారిన ధూల్‌పేట్‌ను గంజాయి రహిత ప్రాంతంగా మార్చడానికి అధికారులు వరుస దాడులు జరుపుతున్నారు. దీంతో గంజాయి ముఠాలు హడలెత్తిపోతున్నాయి. ఆపరేషన్ ధూల్‌పేట్ ముగియడానికి మరో పది రోజుల టైమ్ ఉన్నా?అంతకుముందే అక్కడినుంచి పెట్టెబేడా సర్దుకుని పారిపోతున్నాయి గంజాయి మాఫియా గ్యాంగ్స్.గంజాయి మాఫియా గడ్డ ధూల్‌పేట్..!హైదరాబాద్‌లో గంజాయి మాఫియా గడ్డ ధూల్‌పేట్. దాని అడ్డాగానే నగరం అంతటా గంజాయి అమ్మకాలు జరుగుతుంటాయి.

# తెలంగాణలో మాటల మంటలు

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో మాటలు కోటలు దాటుతున్నాయి. నేతలు నిగ్రహం కోల్పోతున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఇంకా తాము ప్రతిపక్షంలోనే ఉన్నామన్నట్లు వ్యవహరిస్తుండగా, అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు తాము ఇంకా అధికారంలో ఉన్నామన్న భావనలోనే అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు. ఈధోరణి అధికార పార్టీ నేతల్లో మరింత అసహనం పెంచుతోంది. అధికారంలో లేకపోయినా అధికారంలో ఉన్న నేతలను ధూషించడాన్ని సహించలేకపోతున్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డే ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలను అటాక్ చేస్తున్నారు. విపక్షంలో ఉ న్నపట్టిలాగే దూకుడు ప్రదర్శిస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తన పదునైన మాటలతో చీల్చి చెండాడుతున్నారు. అధికారం చెప్పట్టినప్పటి నుంచి ఇదే దూకుడు కొనసాగిస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ తన ప్రభుత్వాన్ని పడగొట్టి మళ్లీ అధికారంలోకి వస్తామని బెదిరించడంతో ముందుగా బీఆర్ఎస్ పార్టీనే సగం ఖాళీ చేసేసి కేసీఆర్‌కు పెద్ద షాక్ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికలలో కూడా బీఆర్ఎస్ పార్టీని దెబ్బ కొడితేనే కేసీఆర్‌ని కట్టడి చేయగలమని గ్రహించి దెబ్బ తీసి, ఫామ్‌హౌస్‌లో నుంచి బయటకు రాకుండా కట్టడి చేశారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ ఉద్యమంతో రాజకీయంగా ఎదిగారు. అంతకుముందు రాజకీయాల్లో ఉన్నా? తెలంగాణ ఉద్యమమే కేసీఆర్‌కు గుర్తింపు తెచ్చింది. ముఖ్యమంత్రిని చేసింది. ఇక రేవంత్‌రెడ్డి కూడా రాజకీయాల్లో అంత సుఖమైన ప్రయాణం సాగించలేదు. అనేక డక్కీమొక్కీలు తిన్నారు. టీడీపీలో ఓటుకునోటు కేసు.. కాంగ్రెస్ పార్టీలో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటూ ముఖ్యమంత్రి స్థాయికి వచ్చారు. శ్రీరాముడు వానర సైన్యంతో మహా శక్తిశాలి అయిన రావణుడిని వదించిన్నట్లే, తన మాట అసలు వినని వానర సైన్యం వంటి కాంగ్రెస్ నేతలను వెంటబెట్టుకొని రేవంత్ రెడ్డి, రాజకీయాల్లో అపర చాణక్యుడని పేరు గుర్తింపు ఉన్న కేసీఆర్‌ను ఎన్నికల్లో ఓడించారు. పామ్‌హౌస్‌కు పరిమితం చేశారు.కేసీఆర్ అంతటివాడిని రేవంత్ రెడ్డి ఓడగొట్టారనే విషయం మరిచిన కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ సీఎం రేవంత్‌రెడ్డికి కొరకరాని కొయ్యలా తయారయ్యారు. ముప్పు తిప్పలు పెడుతున్నారు. సబ్జెక్ట్, లెక్కల ఆధారంగా రేవంత్‌రెడ్డిని బలహీనపర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రేవంత్ రెడ్డికి కావలసింది కూడా అదే. లేకుంటే ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యల జాబితా కొండంత ఉంది. కేటీఆర్, హరీశ్‌రావుతో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు పోరాటాలు చేస్తూ ప్రజల దృష్టిని సమస్యలపై నుంచి మళ్లిస్తున్నారు. ఇక కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు రాకపోయినా, రేవంత్ రెడ్డి దూకుడు, వ్యూహాలను, వైఫల్యాలను నిశితంగానే గమనిస్తున్నారు. కవిత జైలు నుంచి బయటకు వచ్చేశాక కేసీఆర్ కూడా ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి రేవంత్ రెడ్డి దూకుడుకి చెక్ పెడతారని తెలుస్తోంది. ఆ ప్రయత్నంలోనే కేసీఆర్ బీజేపీ పెద్దలతో తెర వెనుక రాయబారాలు నడుపుతున్నారని రేవంత్‌రెడ్డి స్వయంగా ఆరోపిస్తున్నారు. అంటే కేసీఆర్ వలన ప్రమాదం పొంచి ఉందని రేవంత్ రెడ్డి కూడా గ్రహించిన్నట్లు భావించవచ్చు. అందుకే కాంగ్రెస్ మంత్రులు కోరుకుంటున్న స్వేచ్ఛ, గౌరవం, ప్రాధాన్యత ఇస్తూ రేవంత్ రెడ్డి ఎవరూ పక్క చూపులు చూడకుండా జాగ్రత్తపడుతున్నారు.బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేతులు కలిపినా ఎదుర్కొనేలా రేవంత్‌రెడ్డి వ్యూహ రచన చేస్తున్నారు. అయితే అది అంత ఈజీ కాదంటున్నారు నిపుణులు. అందుకే ఇద్దరూ కలవకూడాదనే తరచూ కుమ్మక్కు ఆరోపణలు చేస్తున్నారు.



రెడ్ డ్రెస్ లో సోకుల విందుతో సెగలు పుట్టిస్తున్న మాళవిక మోహనన్

# అవును... ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నా



అతిలోక సుందరి శ్రీదేవి రెండో కుమార్తె, జాన్వీ కపూర్ సోదరి ఖుషి కపూర్ ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్లు ఒప్పుకుంది. పాత వీడియోని ప్రదర్శిస్తూ దానిపై ఆరా తీసిన నెటిజన్‌తో ఇన్‌స్టాలో ఖుషీ తన సినిమా అరంగేట్రం చేయడానికి ముందు ముక్కు, పెదవుల (లిప్ ఫిల్లర్స్)ను శస్త్ర చికిత్సతో సరి చేయించుకున్నట్టు వెల్లడించింది. ఈ వీడియోలో ఖుషి తన తల్లి శ్రీదేవితో కలిసి ఒక ఈవెంట్‌కు హాజరైంది. అప్పటికి తను చిన్నపిల్ల%ో% కానీ ఇప్పుడు టీనేజీ అమ్మాయి. తన మొదటి ఓటీటీ చిత్రం ది ఆర్చీస్ ప్రీమియర్ తో ఎంట్రీ ఇచ్చిన సమయంలో వీడియో అది. ఖుషి పాత రూపం గురించి ఒక నెటిజన్ ప్రశ్నించాడు. దానికి వెంటనే ప్రతిస్పందనగా ఖుషీ ఈ ప్రక్రియ నిజమేనని సింపుల్ వ్యాఖ్యతో ధృవీకరించింది. ఈమోజీలతో అది నిజమేనంటూ ఖుషి కపూర్ సింపుల్ గా అంగీకరించడం నిజానికి నెటిజన్‌కు షాక్ నిచ్చింది. చాలా మంది నెటిజనులు ఖుషి నిజాయితీని మెచ్చుకున్నారు. మరోవైపు అక్క జాన్వీ బాటలోనే ఖుషి కపూర్ కూడా టాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తోందంటూ ప్రచారం సాగుతోంది. ఇటీవల మీడియా కథనాల ప్రకారం.. నందమూరి బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ సరసన ఆరంగేట్రం చేయడానికి చర్చలు జరుపుతోందని తెలుస్తోంది. ఖుషి ఇప్పటికే హిందీలో ది ఆర్చీస్ అనే వెబ్ సిరీస్ లో నటించింది. అలాగే రెండు హిందీ చిత్రాల్లోను నటిస్తోంది. తదుపరి టాలీవుడ్ ఎంట్రీపై పక్కా ప్రణాళికతో సిద్ధమవుతోంది. మరోవైపు ఖుషి కపూర్ సోషల్ మీడియా క్వీన్ గా, మ్యాగజైన్ కవర్ గాళ్‌గా యువతరంలో గిలిగింతలు పెడుతోంది. వరుస ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది.

# కంటెంట్‌ను బట్టే విజయం




'ప్రస్తుతం మంచి కంటెంట్ ఉంటే చిన్న సినిమాలు కూడా పెద్ద విజయాలను సాధిస్తున్నాయి. సినిమా చిన్నా పెద్దా అనే విషయం కంటే కంటెంటే ప్రధానం. తమిళంలో విజయవంతమైన ఈ చిత్రం తెలుగులో కూడా సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు రామ్‌గోపాల్‌వర్మ. హారర్ థ్రిల్లర్ 'డీమాంటీ కాలనీ–2' ఈ నెల 23న తెలుగులో విడుదలకానుంది. అరుల్‌నిధి, ప్రియా భవానీ శంకర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకుడు. బి.సురేష్ రెడ్డి, మానస రెడ్డి తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. హారర్ కంటే థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఎక్కువగా ఆకట్టుకుంటాయని, తమిళంలో మాదిరిగానే తెలుగులో కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత బి.సురేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సినిమాకు మరో రెండు భాగాలను తెరకెక్కించబోతున్నామని దర్శకుడు ఆర్.జ్ఞానముత్తు తెలిపారు.

# చనిపోయిన వారు తిరిగొస్తే?



రిషి, ప్రియాంక కుమార్ జంటగా తెలుగు, కన్నడ భాషల్లో రూపొందిన చిత్రం 'రుద్ర గరుడ పురాణం'. కేఎస్ సందీప్ దర్శకుడు. అశ్విన్ విజయ్, లోహిత్ నిర్మాతలు. నాలుగు దక్షిణాది భాషల్లో విడుదల కానుంది. బుధవారం నిర్మాత, దర్శకుడు మధుర శ్రీధర్ టీజర్‌ను లాంచ్ చేశారు. హీరో రిషి మాట్లాడుతూ 'గరుడ పురాణంలోని అంశాలు ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. 25 ఏళ్ల క్రితం ఓ బస్సు ప్రమాదంలో చనిపోయిన వారంతా తిరిగి వస్తే ఏం జరిగిందన్నదే చిత్ర కథ. సీట్‌ఎడ్జ్ థ్రిల్లర్‌గా ఆకట్టుకుంటుంది' అన్నారు. హీరో రిషి అద్భుతమైన నటుడని, ఆయన నటించిన కన్నడ సినిమాలు కొన్ని చూశానని మధుర శ్రీధర్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: కృష్ణప్రసాద్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: కేఎస్ సందీప్.

# కోపం వచ్చిదంటే బ్లాక్‌బస్టరే!

'మన మధ్యలో ఏదో తెలియని బంధం ఉంది. దానిని మరింత పటిష్టం చేసే సినిమా 'సరిపోదా శనివారం'. రిలీజ్ రోజున థియేటర్లన్నీ మార్మోగిపోతాయి' అన్నారు నాని. ఆయన కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం' ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అగ్ర నిర్మాత దిల్‌రాజు విడుదల చేస్తున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాని మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం మీ అందరిలాగే ఆతృతగా ఎదురుచూస్తున్నా. తనవాళ్ల శ్రేయస్సు కోసం కోపాన్ని పాజిటివ్ వేలో ఉపయోగించే ఓ వ్యక్తి కథ ఇది. ఇప్పుడు నాకు కోపం వచ్చింది. నాకు కోపం వచ్చిందంటే బ్లాక్‌బస్టర్ హిట్ పక్కా (నవ్వుతూ)' అన్నారు. నాని గత చిత్రం 'దసరా'ను ఈ సినిమా బీట్ చేస్తుందనే నమ్మకం ఉందని, దర్శకుడు వివేక్ అద్భుతంగా తెరకెక్కించాడని దిల్‌రాజు తెలిపారు. గొప్ప కథను దర్శకుడు వివేక్ అంతే గొప్పగా తెరకెక్కించాడని, నాని నటన హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాత డీవీవీ దానయ్య చెప్పారు. ఈ సినిమాలో తాను చారులత అనే బ్యూటీఫుల్ క్యారెక్టర్‌లో కనిపిస్తానని కథానాయిక ప్రియాంక మోహన్ పేర్కొంది.

